# మూడు కోణాలు

అరుణ అప్పుడే స్నేహితురాలి ఇంటినుంచి వచ్చింది. సాయంత్రం వేళ తల్లి కమలమ్మ వరండా వెనక ఉన్న పెద్ద గదిలో కూర్చుని తల ఆరబెట్టు కొంటూంది. ఆమె కేశరాశిలోని తెలుపు నలుపు వెంట్రుకలు, జీవితం లోని కష్ట సుఖాల్లాగ మిశ్రితమై ఒక వింత సోయగాన్ని కలిగిస్తున్నాయి. ఆ గదిలోనుంచి, పడక గదిలోకి వెళ్లిన కూతుర్ని చూసి నిట్టూర్చిందావిడ.

'జీవితంలో మూడు వంతులు ముగిసింది. జరగవలసినవన్నీ జరిగాయి. ఇంకా అరుణ పెళ్లి కావాలి. అది ముడిపడటమే కష్టంగా ఉంది' అనుకుంది ఆవిడ.

స్నేహితురాలి ఇంటినుంచి వచ్చిన అరుణ మనసు నిలకడగా లేదు. వెన్నెల కోసం చూస్తూంటే ఆకాశాన్ని నల్లని మబ్బులు అలిమినట్లు, తాగబోయిన పాలు విరిగినట్లు జడలో ముడుచుకోబోయిన గులాబి రేకులు విడిల్చినట్లు ఆమె మనసు గిజగిజలాడుతూంది. స్నేహితురాలు మీటిన వీణానాదం ఇంకా ఆమె అంతరంగంలో నివసిస్తూనే ఉంది. నెరవేరని కోరికలను, ఆశలను నాట్యం చేయిస్తూందా సంగీతం ఆమెలో.

ఈ వేళ వాళ్లదగ్గరినుంచి ఉత్తరం వస్తుందనుకున్నారు. వచ్చిందేమో? అమ్మ తీరు చూస్తూంటే వచ్చినట్లే ఉంది.

ఏమని వ్రాశారో! అరుణ తల్లి దగ్గరకు వెళ్లి అడిగింది.

''ఉత్తరం వచ్చిందా, అమ్మా?''

''ఆఁ వచ్చింది'' అంది తల్లి కూతురిముఖంలోకి చూస్తూ.

''ఏమని వ్రాశారు?'' మెల్లగా అడిగింది అరుణ.

''ఏమని వ్రాస్తారు? ఐదువేలు కావాలిట. మూడువేలు ఇద్దామను కున్నాము ఇంకా కావాలంటే ఏం చేస్తాము? ఇంకో సంబంధం చూసుకోవాలి. లేదా పెళ్లే మానుకోవాలి.''

తల్లి కంఠం కటువుగా వినిపించింది అరుణకు. ఆమెలో నాట్యం చేస్తున్న, నెరవేరని కోరికలు, రేకెత్తిన ఆశలు స్తంభించి చూశాయి. అరుణకు దెబ్బ తగిలినట్లనిపించింది.

కలలు మేల్కొనే కన్నె వయసు తొలి జాముల్లో పక్కఇంటి శ్రీధర్ అరుణలో ఆశలు మొగ్గ తొడగటానికి కారణమయ్యాడు. ఆశలు ఆనందంగా పుష్పించటానికి, వాళ్లకు తమకు అంతస్తుల తేడా ఉందని వాస్తవికత అర్థమవుతుంటే అరుణలో అభిమానం మేల్కొని అడ్డు వచ్చింది. తనను దుఃఖంనుంచి రక్షించింది అని కూడా అనుకుంది. పెళ్లిచేసుకోవాలనే కోరిక తిరిగి పోయింది. చదువుకోవాలనుకుంది.

'అక్కయ్యలు పెళ్లి చేసుకుని ఏం సుఖపడుతున్నారు? నేను చదువుకొని స్వతంత్రంగా ఉండాలి. ఉద్యోగం చేసి నాన్నకు ఆర్థికంగా సాయపడాలి. అసలు పెళ్లి చేసుకోకూడదు. ఈ పెళ్లే కదూ అన్ని అనర్థాలకూ మూలం? పిల్లలూ, అనారోగ్యాలూ, ఆర్థికపు ఇబ్బందులూనూ. పిల్లల్ని కనటం, ఈ బాధలన్నీ పడటం ఎందుకు? పుట్టుక అంటే ఆకళ్లు పుట్టించటం. మన ఆకళ్లే తీరనప్పుడు ఇంకా ఆకళ్ళను పుట్టించి ప్రపంచంలో అసంతృప్తిని పెంచటం ఎందుకు? నేనసలు పెళ్లి చేసుకోను, అనుకుంది.

ఇంకో రెండేళ్లు గడిచి, కాలేజిలో చదువుతుంటే, అవివాహితలు, ఉద్యోగి నులు పడుతున్న బాధలు అవగతం అవుతుంటే, పోనీ పెళ్లి చేసుకుంటే? అనే ఆలోచన వచ్చింది.

'నాన్నకు నా బాధ్యత కూడా తీరుతుంది. ఇంకా నా బాధ్యతే నెత్తిమీద పెట్టుకుని కుర్చుంటే మిగతా పిల్లల్ని చూసుకోవద్దా? పెళ్లి చేసుకుంటే నా సంసారం నాకు వస్తుంది. నా కష్టం, సుఖం నావి అవుతాయి. నాపాట్లు నేను పడవచ్చు అనుకుంది.

సంబంధాలు వస్తున్నాయి. పోతున్నాయి. కట్నాలు కావాలి. కట్నం తక్కువయితే వచ్చే వరుడు అతని సంపాదనతో, తనను పోషించుకుని భార్యనైనా పోషించగలడో లేడో అనుమానమే. చదువుకుంటేనే మంచిది అనిపించింది.

''బి.ఎ. పాసయితే నన్ను యూనివర్శిటీకి పంపిస్తారా, అమ్మా?'' అని అడిగింది.

అమ్మ ఎప్పటిలాగే విసుగ్గా-

''ఇది అవనీ. అక్కడికి పంపిస్తే ఇప్పుడు మోహన్‌కి పంపే వందా కాక, నీకోసం ఇంకొక వందా తేవాలి...'' అంటూ ఇంకా ఏమందో అరుణ వినలేదు. పోనీ ఉద్యోగం చేస్తూ ప్రైవేట్‌గా చదువుకుంటే? బి.ఎ. అయ్యాక తల్లిని అడిగింది.

''ఎందుకొచ్చిన ఉద్యోగం! పెళ్లి చేసి పంపవలసిన పిల్లని. వచ్చే సంబంధాలు కూడా వెనక్కు వెడతాయి. ఈ కాస్తలో తొందర పడట మెందుకు? సంబంధం కుదరకపోతుందా ఏం? చదువు తక్కువా, రూపం తక్కువా?'' అంది అమ్మ.

ఈ మధ్యనే ఒకళ్లు వచ్చి చూసుకు వెళ్లారు. వాళ్లకు ఐదు వేలు కావాలిట. ఎక్కడినుంచి తెస్తారు నాన్న? ఇంత చదువుకుని, తెలివితేటలు ఉండి కూడా ఎందుకింత హైన్యం పొందటం? తల్లిదండ్రులకు బరువు కావటం? వాళ్లకు అనుకూలంగా ఉండాలని అనుకుంటే చివరకు ఎదుర్కొనేది ఇదా?

తనకు పెళ్లీ అవదు; చదవూ చదివించరు. పోనీ,ఉద్యోగం ఎందుకు చెయ్యనివ్వరు? వాళ్ల ఇష్టప్రకారమే నడుస్తున్నా, అమ్మకు తన మీద కోపం ఎందుకు? ఎందుకు అంత కఠినంగా మాట్లాడుతుంది? వాళ్లు ఐదు వేలు అడగటం తన తప్పా? చివాలున కుర్చీలోనుంచి లేచింది.ముఖంలో ఆవేదన ప్రస్ఫుటమవుతుంటే –

''చదివించనూ లేరు, పెళ్లి చెయ్యలేరు. నన్నెందుకు కన్నావమ్మా?'' అని తన గదిలోకి వెళ్లిపోయింది.

కమలమ్మకు అసలే మనసు బాగుండలేదు. పరధ్యానంగా ఉన్న ఆవిడ, కూతురు మాటలకు అదిరిపడింది శోకం కూడా వచ్చింది.

''నేను అనుకున్నాను – ఒక రోజు ఎప్పుడో ఇది నన్ను అడుగుతుంది అనే అనుకున్నాను. అడిగేసింది' అనుకుంది.

'పెద్దది విజయకు పెళ్లినాటికి జ్ఞానమే లేదు. చిన్నప్పుడే పెళ్లి చేశాము. శారదకు కూడా తెలిసినవాళ్ల సంబంధం ఉండటం వలన ఆలస్యం కాకుండానే పెళ్లి అయ్యింది. మూడవది సుందరికి మేనరికం. రాధకు ఏ కోరికలు ఉండేవో పైకి ఒక్క మాట అనేది కాదు. కొంచెం ఆలస్యమయినా, చదువు ఆపేసినా, మౌనం వహించి, మాకు నచ్చిన సంబంధం కుదర్చగానే పెళ్లి చేసుకుంది. అమ్మను నాన్నను కష్ట పెట్టకూడదు అనే

భావమే దానికి ఎప్పుడూను. అరుణ సంగతి వేరు. వాళ్లలాగ కాదు. మొహంమీద అడిగేస్తుంది ఏ విషయమైనా.

ఇంకా చదువుకుంటానని అడిగింది.

''మోహనుణ్ణే చదివించాలి కదా?'' అంటే — ''ఏం, నన్నెందుకు చదివించకూడదూ? అంది.

'వాడు మొగవాడు. ఉద్యోగం చెయ్యాలి. మంచి చదువు ఉంటే కదా బాగుపడేది?'' అంటే —

వాడు బాగుపడాలి. నేను చదువుకుంటే నేను బాగుపడనా? వాడు చదువుకుంటే డబ్బు తెస్తాడు. నేను పెళ్లిచేసుకుని వెళ్లిపోతాను. నేనే బాగు పడతాను మీకు ఉపయోగించను. ఔనా?'' అంది.

తనేం చెప్పగలదు?

''నేనేం చెప్తాను! చదువుకుంటానని మీనాన్నని అడుగు వెళ్లి'' అంది. ఆ రోజు అట్లాగ అడిగింది. ఈ రోజు ఈ విధంగా అడిగింది.

'నేను భయపడుతూనే ఉన్నా అడుగుతుందని. అడిగేసింది. ఆఖరికి అంతమాట అనిపించుకున్నాను. ఆవిడలో ఆవేశం అణిగాక శోకం తగ్గింది. మనసు కాఠిన్యం వహిస్తుంటే వెళ్లి అరుణ ఉన్న గది గుమ్మం దగ్గర నించుని —

''ఎందుకు కన్నావని అడుగుతున్నావు కదూ? చెప్తాను, విను. ఏమీ అనుభవించుదామని కాదు. చిన్న తనపు ఆటల్లో, ఊహల్లో ఏ సుఖం అనుభవించానో, అంతే, పెళ్లి అయింది మొదలు మంచీ చెడ్డా అని మర్యాదకి తల వంచి, ఇంట్లో వాళ్ల కోర్కెలకి అనుగుణంగా మసలి, నా సుఖాన్ని మరిచిపోయి ఏ మనుభవించాను? ఏ మనుభవిద్దామని మిమ్మల్ని కన్నాను?

మనసులో ప్రేమ పొరలగా ఇద్దరు పిల్లల్ని కన్నాను. ప్రేమ అనే భ్రాంతిలో ఇంకో ఇద్దరు పుట్టారు. తర్వాత ధర్మం అనుకున్నాను. అంతే. కళ్లు మూసుకుపోయి కనలేదు. సుఖపడదామనీ కనలేదు. ధర్మ మనుకున్నదాన్ని నిరసించాల మనోబలం నా దగ్గర లేక కన్నాను. నీ చేత అడిగించుకుంటాననీ అనుకోలేదు.

కాదు, అసలు నిన్ను నేను కనలేదు నువ్వే పుట్టావు. నీ కర్మ అనుభవించడానికి నువ్వే పుట్టావు. నీ కర్మ అనుభవించడానికి నా కడుపున పుట్టావు. ఇంకా లక్షాధికార్ల ఇంట్లో పుట్టకపోయావా? కర్మ కాకపోతే ఒకరికి సంతానం ఉండదు. ఒకరికి

పదిమంది సంతానం అందరికీ ఒకే లాగ పుట్టి పెరగరేం పిల్లలు?

ఎందుకు కన్నావని నన్ను అడగటం కాదు. అన్నీ నన్ను అడుగుతావేం? అడగటానికి నీకు నేనే దొరికానా? చదువుకుంటావో, పెళ్లి చేసుకుంటావో, మీ నాన్నని అడుగు. కనటం, పెంచటం వరకే నా బాధ్యత. నిజమే, నేను తెలివి తక్కువదాన్ని. మీ అందరికోసమే దుఃఖాన్ని మోస్తున్నా ననుకున్నాను. కానీ, కనటమెందుకు దుఃఖపడటమెందుకు అనే ప్రశ్నలు రాలేదు నాకు. దుఃఖాన్ని సహించగలిగాను కానీ, నీచేత అడిగించుకోవటం సహించలేకపోతున్నాను. నువ్వు తెలివైనదానివి. ఈ కాలపుదానివి. నాలాగ పిల్లల్ని కనకు. కనినా వాళ్ల చేత అడిగించుకోకుండా పెంచు. తెలిసిందా? నన్ను అడగటం కాదు. నువ్వు సాధించి చూపించు. నేనూ సంతోషిస్తాను'' అంటూంది.

తల్లి మాటలు వింటూ ఆవిడ ముఖంలోకి చూస్తూ ఉండిపోయింది అరుణ. కమలమ్మ చెంపల వెంట కారుతున్న నీళ్లు నేలమీద టపటపా రాలుతున్నాయి.

కొంచెం స్పృహలోకి వచ్చాక, ఆవిడకు వరండాలో చెప్పుల చప్పుడు వినిపించిన సంగతి గుర్తు వచ్చింది.

'ఆయన వచ్చారు కాబోలు!' అనుకుంటూ వరండాలోకి వెళ్లిందావిడ. అక్కడ చెప్పులు లేవు. మనిషీ లేరు.

''ఎక్కడికి వెళ్ళారు!'' అని ఆవిడ ప్రశ్నించుకుంటుంటే ఆడుకోవటానికి వెళ్లిన కొడుకు రాము –

''నాన్న ఇమ్మన్నారు'' అని మడిచిన కాగితం అందించాడు.

''సుఖంగా జరిగిపోతుంటే, సాధారణంగా ఈ సుఖానికి కారణం కానీ, కారకులెవరనీ ఆలోచించము. కానీ దఃఖంలో ఉంటే దానికి కారకుల్ని అన్వేషిస్తాము. రెండవ వారిమీద ఆరోపణ వేస్తాము. ఇది మానవ సహజం.

నిన్ను నేనేమీ అనను, కమలా. నీ బాధ నాకు తెలుసు. నేను ఇప్పుడే అర్థం చేసుకున్నాననటం సమంజసం. నీ బరువు, బాధ్యతలు నాకు తెలుసు. దానికి కృతజ్ఞత, గౌరవమే నా మనసులో నిండి ఉన్నాయి. దుఃఖంలో వివశవయి అల్లాగ అన్నావు. మన సంసారంలో ఉన్నది, మిగిలింది అంతా నా సుఖమేనా? ఇది నా సంసారం, నా భర్త, నా పిల్లలు అనే తృప్తి నీకేమీ లేదా? నీ హృదయాన్ని ప్రశ్నించుకో. మనం ఒక పురాతనకాలంలోనుంచి, ఒక మారిన ధర్మం గల కాలంలోకి నడుస్తున్నాము. ఏ

కాలంలోనైనా సమాజంలో ఆడపిల్లలు పెళ్లి కాకుండా ఉండిపోవటం కంటె దౌర్భాగ్యం ఇంకొకటి లేదు. దానికి కారణం వెతికి ప్రయోజనం లేదు. అది కాల గతి తీర్చిన బాట. నాగరికత అందుకున్న మైలు రాయి. ఎప్పుడూ ఏదో ఒక సమస్య కాలాన్ని బాధిస్తూనే ఉంటుంది. ఆ సమస్యను కాలమే పరిష్కరించాలి. ప్రస్తుతంలో దానికి గురి అయ్యేవారు దురదృష్టవంతులు. ఇంతవరకూ నా ఉద్దేశాలు నావి. నీ దృక్పథంనుంచి కాని, అరుణ పరిస్థితి నుంచి కాని ఈ విషయాన్ని నేను ఆలోచించలేదు. అది నాకే ఆశ్చర్యం కలిగిస్తూంది ఈ నాడు.

నువ్వు సహించావు. ఇంకా సహించాలనే చూస్తూన్నావు. కానీ సహించి నందువలన సమస్య పరిష్కారం కాదు. ఇంకొకరి కోణంనుంచి చూడగలిగితేనే ఒక సమస్యను శాంతి యుతంగా పరిష్కరించగలుగుతాము. ఈ సామరస్యం కుటుంబ జీవనానికి పునాది. నేను చేసినది తప్పే. నీ సహనానికి అంతులే దనుకున్నాను. అరుణ పెళ్లికి తొందర ఏమిటి అనుకున్నాను. అరుణ చిరు గాలికి అల్లలాడే చిగురాకు. భవిష్యత్తు గురించి కలలు – జిజ్ఞాస, ఆశ – నిరాశలు ఘర్షణ పడే వయసు. వాటికి ఒక దారి చూపించకపోతే – అవును, చదివించక, పెళ్లి చెయ్యకపోతే అరుణ ఏం చేస్తుంది? ఉద్యోగం చేసినా, అరుణకు పెళ్లి చెయ్యక తప్పదు ఈ మన పెంపకంలో పెరిగిన పిల్ల తనకు తానుగా పెళ్లి చేసుకోలేదు. అది నా కోరిక కూడా కాదు. ఆఖరి పిల్ల, ఉన్నంతలో మంచి సంబంధం తేవాలనే జాప్యం చేశాను. మనకు అనుకూలుడూ, ఆదర్శాలు గలవాడు వస్తాడని, కట్నం ఈయరాదనే అభిప్రాయంతో ఉన్నాను. ఈ పరిస్థితిలో మనం కట్నం ఇవ్వక తప్పదు. అవును, పిల్లవాడు అందరికీ నచ్చాడు. నేను సంబంధం నిశ్చయించుకుని తిరిగి వస్తాను.'' తల్లి చేతిలోని ఉత్తరం అందుకుని చదివిన అరుణ, 'ఎంత తప్పు చేశాను!' అనుకుని తల ఎత్త లేకపోతూంది.

''నువ్వు చిన్నదానివి. ఏదో అన్నావు. ఎప్పుడూ ఒక మాట ఎదురు చెప్పని దాన్ని, నొప్పించనిదానిని నేనెందుకు ఆవేశపడాలి? ఈ అనుభవం కూడా రాసిపెట్టి ఉంది కాబోలు. గుమ్మంలోకి వచ్చిన మనిషిని తిప్పి పంపించాను. ఎంత తప్పు చేశాను! నాదే తప్పు, నాదే తప్పు!'' అంటూ కుర్చీలో కూలబడింది కమలమ్మ.

* * * *